


పాలకొల్లులో దాసరి వర్ధంతి

పాలకొల్లు:కీర్తిశేషులు దర్శకరత్న డాక్టర్ దాసరి నారాయణరావు ఆరో వర్ధంతిని పాలకొల్లులో మంగళవారం నిర్వహించారు. ఈ పట్టణంలోని దాసరి కాంస్య విగ్రహానికి ఆయన అభిమానులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సినీ వినీలాకాశంలో దాసరి ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారని పలువురు కొనియాడారు. గిన్నీస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో ఎక్కువ సినిమాలకు దర్శకత్వం వహించి రికార్డు సృష్టించడమే కాకుండా ఆయన శిష్యులు కూడా గిన్నీస్ బుక్‌లో రికార్డ్ సాధించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వంగా నరసింహారావు, మేడికొండ శ్రీనివాస్, యర్రంశెట్టి వెంకట రత్నం, బోనం మునసబు, చిటాకుల వెంకట రమణ, చవాకుల నరేష్ బాబు పాల్గొన్నారు.



దాసరి కాంస్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

పారదర్శకంగా ఉద్యోగుల బదిలీలు

ఫిర్యాదులు అందితే ఉపేక్షించేది లేదు
జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీలను అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ పి.ప్రశాంతి సంబంధిత అధికారులకు సూచించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ సంబంధిత అధికారులతో సమావేశమై గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల జిల్లా, అంతర్ జిల్లా బదిలీలపై చర్చించి మాట్లాడారు. బదిలీలను షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలని పేర్కొన్నారు. ఫిర్యాదులు, ఆరోపణలకు తావులేకుండా బదిలీలు జరిపే బాధ్యత సంబంధిత అధికారులపైనే ఉందని స్పష్టం చేశారు. ఫిర్యాదులు ఏమైనా అందితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. జూన్ పదో తేదీ వరకూ బదిలీలకు అవకాశం ఉందని చెప్పారు. జిల్లా పరిధిలో మూడు కేటగిరీల ప్రాతిపదికన బదిలీలు నిర్వహిస్తామన్నారు. మెడికల్ (గ్రౌండ్స్), భార్యాభర్తలు ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులు, సింగిల్ ఉమెన్ కేటగిరిలో జిల్లా పరిధిలో బదిలీకి కోరవచ్చన్నారు. ఇతర జిల్లాలకు వెళ్లాలంటే మాత్రం పరస్పర అంగీకారం, భార్యాభర్తలు కేటగిరిలో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. జిల్లా పరిధి, అంతర్ జిల్లాల బదిలీలకు గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులు వచ్చే జూన్ మూడో తేదీ వరకూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఉద్యోగుల రోజువారీ హాజరు నమోదు చేసే హెచ్ఆర్ఎంఎస్ పోర్టల్‌లోనే బదిలీల కోసం దరఖాస్తు చేసుకునేలా లింకును అందుబాటులో ఉంచామన్నారు. వీటి పరిశీలన, అభ్యంతరాల స్వీకరణ, బదిలీల తుది జాబితా తయారీ, తదనంతర ప్రక్రియను జూన్ పదిలోగా పూర్తి చేయాలని ఆదేశించారు.

జిల్లా పరిధిలో బదిలీ షెడ్యూల్ ఇలా

మే 28న సంబంధిత జిల్లా కార్యాలయాల్లో ఖాళీల వివరాలు సమర్పించాలని జిల్లా కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. జూన్ 3 వరకు స్వీయ ధ్రువీకరించిన వివరాలతో బదిలీ కొరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జూన్ ఐదో తేదీ వరకు ఆన్‌లైన్ అప్లికేషన్లను నియామక అధికారి కార్యాలయ పరిశీలన ఉంటుందన్నారు. జూన్ ఆరో తేదీన వెయిట్ ర్యాంక్ జాబితా ప్రదర్శన, మండలాలు, యుఎల్‌బిల కేటాయింపు, బదిలీకి తిరస్కరించిన కారణాలతో లిస్టులను పోర్టల్‌లో ఉంచుతామన్నారు. జూన్ ఎనిమిది, తొమ్మిది, పది తేదీల్లో నియామకపు అధికారి ఫిజికల్ కౌన్సెలింగ్ నిర్వహించి, నిర్దిష్ట గ్రామ, వార్డు సచివాలయాన్ని చూపుతూ బదిలీ ఉత్తర్వులను జారీ చేయాల్సి ఉంటుందన్నారు. జూన్ పదో తేదీ నుండి ఉద్యోగి ఏదైనా ఫిర్యాదులుంటే కలెక్టర్‌కు ఫిర్యాదు చేయొచ్చన్నారు.

అంతర్ జిల్లా బదిలీ షెడ్యూల్ ఇలా

ఈనెల 28న సంబంధిత జిల్లా కార్యాలయాల్లో ఖాళీల వివరాలను సమర్పించాలని కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. జూన్ మూడో తేదీ వరకూ స్వీయ ధృవీకరణ వివరాలతో బదిలీల కోసం దరఖాస్తు, వాటి మూలాధార జిల్లాకు నియమించే అధికారి అప్లికేషన్లు డెస్టినేషన్ డిస్ట్రిక్ట్ కౌంటర్ పార్ట్‌కు పంపుతుందని చెప్పారు. జూన్ ఐదో తేదీన డెస్టినేషన్ డిస్ట్రిక్ట్ ఫార్వర్డ్ చేసిన వివరాలను పొందుపరచి రాష్ట్ర హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్‌కు ప్రతిపాదనను సమర్పిస్తుందని పేర్కొన్నారు. జూన్ ఎనిమిదో తేదీ నాటికి రాష్ట్ర హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ దరఖాస్తులను కార్యదర్శికి అందిస్తామన్నారు. ప్రభుత్వానికి, జిఎడి కార్యదర్శికి సర్క్యులేట్ చేసి ఉత్తర్వులను జారీ చేస్తారని చెప్పారు. జూన్ ఎనిమిది, తొమ్మిది, పది తేదీల్లో నియామకపు అధికారి ఫిజికల్ కౌన్సెలింగ్ నిర్వహించి, నిర్దిష్ట గ్రామ, వార్డు సచివాలయాన్ని చూపుతూ బదిలీ ఉత్తర్వులను జారీ చేయాల్సి ఉంటుందన్నారు. జూన్ పదో తేదీ నుండి ఉద్యోగి ఏదైనా ఫిర్యాదులుంటే కలెక్టర్‌కు అందించాలని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా జిఎస్‌డబ్ల్యుఎస్ అధికారి కెసిహెచ్.అప్పారావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, డిఎంహెచ్ఒ. డి.మహేశ్వరరావు, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి కె.మురళీకృష్ణ, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ఎ.దుర్గేష్, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి కె.శోభారాణి పాల్గొన్నారు.

బిజెపి మతతత్త్వ, కార్పొరేట్ విధానాలను తిప్పికొట్టాలి


కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా కలిసొచ్చే ప్రజాతంత్ర శక్తులతో పని చేసేందుకు సిద్ధం
బిజెపి విధానాలను రాష్ట్రంలో అమలు చేస్తున్న వైసిపి
నోరు మెదపని టిడిపి, జనసేన
సిపిఎం జిల్లా విస్తృత సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు తులసీదాస్



సమావేశంలో మాట్లాడుతున్న బి.తులసీదాస్

ప్రజాశక్తి - భీమవరం

కార్పొరేట్, మతతత్వ పాలన సాగిస్తున్న బిజెపిని ఒంటరిపాటుచేసి రాబోయే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, ప్రజాశక్తి దినపత్రిక ఎడిటర్ బి.తులసీదాస్ పిలుపునిచ్చారు. భీమవరం క్లాత్ మర్చంట్స్ భవనంలో పార్టీ జిల్లా విస్తృత సమావేశం మంగళవారం నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన తులసీదాస్ మాట్లాడుతూ బిజెపికి వ్యతిరేకంగా కలిసి వచ్చే ప్రజాతంత్ర శక్తులతో పని చేసేందుకు సిపిఎం సిద్ధంగా ఉందని, ముఖ్యంగా ప్రజా సమస్యల పరిష్కారంతోపాటు ప్రజాజీవన విధానాలు మెరుగుపరచేందుకు కృషి చేయాలన్నారు. బిజెపి మతోన్మాద విధానాలను వ్యతిరేకించడంతోపాటు చాపకింద నీరులా విస్తరిస్తున్న ఆర్ఎస్ఎస్ భావజాలాలను అడ్డుకునేందుకు అన్ని శక్తులను ఏకం చేయాలన్నారు. బిజెపి విధానాలను వైసిపి ప్రభుత్వం రాష్ట్రంలో విచ్చలవిడిగా అమలు చేస్తుందని, అయితే ప్రశ్నించాల్సిన టిడిపి, జనసేనలు నోరు మెదపకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. 2008లో ఏర్పడిన ఆర్థిక సంక్షోభం, 2012లో సద్దుమణిగినప్పటికీ నయాఉదారవాద విధానాలతో పరిష్కారం కాలేదని, తాత్కాలికంగా సద్దుమణిగినప్పటికీ కొన్ని దేశాల్లో ఇంకా కొనసాగుతుందన్నారు. వాణిజ్యం, ఎగుమతి, దిగుమతి తగ్గుతుండటం, కొనుగోలు శాతం తగ్గిపోవడం, జిడిపి తక్కువగా ఉండడంతో ప్రపంచంలో ఆర్థికమాద్యం కనిపిస్తుందన్నారు. అభివృద్ధి చెందిన, చెందుతున్న దేశాల్లో ఇది ఎక్కువగా కనిపిస్తుందని వివరించారు. ఉక్రెయిన్, రష్యా మధ్య జరిగిన యుద్ధం ఆ రెండు దేశాలకు నష్టం చేకూర్చినప్పటికీ కొన్ని దేశాలు లాభం పొందాయన్నారు. ప్రపంచ రాజకీయాల్లో అమెరికాకు వ్యతిరేకంగా చైనా గట్టి ప్రయత్నాలు సాగిస్తుందన్నారు. మన దేశం చుట్టూ ఉన్న దేశాలలో ఆర్థిక, పరిపాలన సంక్షోభం ఉన్నాయన్నారు. బిజెపి ప్రభుత్వం దేశాన్ని అన్నివిధాలా దివాళా తీయించిందన్నారు. ప్రభుత్వ ఆస్తులను, సంస్థలను కారుచౌకగా కార్పొరేట్‌లకు కట్టబెడుతున్నాయన్నారు. బిజెపి, ఆర్ఎస్ఎస్ చెప్పినట్లుగా వింటూ భారత రాజ్యాంగంలో ఉన్న హక్కులను తొలగించి దాడి చేస్తుందన్నారు. చాపకింద నీరులా మతతత్వాన్ని విస్తరిస్తోందన్నారు. అన్ని రాజ్యాంగ వ్యవస్థల్లో, విశ్వ విద్యాలయాల్లో సంఘ్ భావజాలం కలిగిన వారిని నియమిస్తోందన్నారు. బిజెపి కార్పొరేట్ విధానాలను రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అమలు చేస్తుందని విమర్శించారు. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ఎన్నికల్లో వైసిపి ఎంపీలు, ఎంఎల్ఎలు బిజెపికి అనుకూలంగా ఓట్లు వేశారని గుర్తు చేశారు. రాష్ట్రానికి ఇవ్వాల్సిన ప్రత్యేక హోదా, విభజన హామీలు, పోలవరం ప్రాజెక్ట్ నిధులు, పునరావాసం కల్పించకుండా బిజెపి ద్రోహం చేసిందని, అయితే ప్రశ్నించాల్సిన టిడిపి, జనసేన నోరు మెదపకపోవడం సిగ్గుచేటు అన్నారు.



హాజరైన నాయకులు

సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం మాట్లాడుతూ జిల్లాలో చాలాచోట్ల ధాన్యం మసూళ్లు ఇంకా పూర్తి కాలేదన్నారు. ఇప్పటికీ ధాన్యం కల్లాల్లోనే ఉందన్నారు. జిల్లాలో ఇళ్ల స్థలాల సమస్య నేటికీ పరిష్కారం కాలేదని తెలిపారు. కొన్ని చోట్ల కేటాయించిన స్థలాల్లో ఇళ్ల నిర్మాణం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారిందన్నారు. ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయం తగినంత లేకపోవడంతో పేదల ఇళ్ల నిర్మాణాలు మధ్యలోనే నిలిచిపోయాయని తెలిపారు. ప్రభుత్వం ఇల్లు, ఇళ్ల స్థలాల విషయంలో ఉన్న సమస్యలను పరిష్కరించి ప్రజలకు ఉపశమనం కల్పించాలన్నారు. టిడ్కో ఇళ్లు లబ్ధిదారులకు అందేలా చూడాలని డిమాండ్ చేశారు. ఒకవైపు లబ్ధిదారులు ఇల్లు రాక, మరోవైపు అద్దెకు ఉంటున్న ఇళ్లకు అద్దెలు కడుతూ, తెచ్చిన అప్పులకు వడ్డీలు కడుతూ తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, కర్రి నాగేశ్వరరావు, పి.వి.ప్రతాప్, బి.వాసుదేవరావు, కేతా గోపాలన్, కవురు పెద్దిరాజు, జిల్లా కమిటీ సభ్యులు జె.నరసింహమూర్తి, జె.సత్యనారాయణ, బి.జార్జి, కె.తవిటి నాయుడు, కె.రాజరామ్మోహన్ రాయ్, కె.బాలరాజు పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేందుకే ఫ్యామిలీ డాక్టర్ : కలెక్టర్

నరసాపురం టౌన్ : ప్రజలందరూ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తయారు చేసేందుకు ఫ్యామిలీ డాక్టర్ పథకం ప్రభుత్వం ప్రవేశపెట్టిందని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. మంగళవారం నరసాపురం మండలం కొప్పర్రు పెదపేట గ్రామంలో వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌లో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని కలెక్టరు ఆకస్మిక తనిఖీ చేసి, వైద్యం అందుతున్న తీరును పరిశీలించారు. సేవల వివరాలను నేరుగా ప్రజలను అడిగి తెలుసుకుని సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పేదలు వైద్యసేవలు పొందేందుకు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని, ఇకమీదట వైద్యం కోసం ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో వారిని సంపూర్ణ ఆరోగ్యవంతులుగా చేసేందుకు ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం ప్రవేశ పెట్టారని చెప్పారు. ఈ కార్యక్రమంలో వ్యాధిని గుర్తించడం దానిని తగ్గించేందుకు వివిధ రకాల వైద్యసేవలు అందించి మందులు అందిస్తారని కలెక్టర్ తెలిపారు. పిహెచ్‌సిలో ఉన్న ఇద్దరు వైద్యులు ప్రతీఇంటికి వెళ్లి పరీక్షలు నిర్వహించి ముందుగా వారికి ఏ విధమైన జబ్బులున్నాయో గుర్తించి వారికి అవసరమైన మందులు ఇవ్వడం, వైద్యం అందించడంతో పాటు ప్రతీవారం వారి ఆరోగ్యాన్ని పరీక్షిస్తామని కలెక్టరు తెలిపారు. వైద్యబృందం తమ గ్రామాలకు వచ్చే ఒకరోజు ముందే ఎఎన్ఎం, ఆశా సిబ్బంది డాక్టర్ల బృందం తమ గ్రామాలకు ఏ రోజున వస్తుందో సమాచారాన్ని ముందుగా అందించి అందుబాటులో ఉంచుతామని ఆమె తెలిపారు.



దీక్షలో పాల్గొన్న ఉద్యోగులు

ఉద్యోగుల పోరాటం పట్ల నిర్లక్ష్యం తగదు

ఎపి జెఎసి అమరావతి జిల్లా ఛైర్మన్ శివశంకర్
కలెక్టరేట్ వద్ద రిలే నిరాహార దీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి - భీమవరం

ప్రభుత్వంలో పనిచేస్తున్న ఉద్యోగులే తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని దీక్షలు చేస్తుంటే ప్రభుత్వం సిగ్గుపడాలని ఎపి జెఎసి అమరావతి జిల్లా ఛైర్మన్ ఎస్.శివశంకర్ విమర్శించారు. మూడో దశ ఉద్యమ కార్యాచరణలో భాగంగా భీమవరం కలెక్టరేట్ వద్ద ఉద్యోగులు రిలే నిరాహార దీక్షలు మంగళవారం ప్రారంభించారు. కలెక్టరేట్‌లో వివిధ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులంతా ఈ దీక్షలో కూర్చుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శివ శంకర్ మాట్లాడుతూ ఉద్యోగుల న్యాయపరమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. ఉద్యోగుల డిమాండ్లు పరిష్కరించని పక్షంలో ఎన్ని దశల ఉద్యమలకైనా సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. దీర్ఘకాలంగా దఫదఫాలుగా సమస్యలు పరిష్కరించాలని పోరాడుతున్న తమ పట్ల ప్రభుత్వం వివక్ష చూపుతుందన్నారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకూ ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎపి జెఎసి అమరావతి జిల్లా కన్వీనర్ ఫణి, జిల్లా అసోసియేట్ ఛైర్మన్ ఎం.సునీల్ కుమార్, ఎపి ఆర్ఎస్ఎ జిల్లా కార్యదర్శి ఎం.రామ్ ప్రసాదరాజు, కలెక్టరేట్ ప్రెసిడెంట్ వై.దుర్గా కిషోర్, ఎపిఆర్ఎస్ఎ జిల్లా జాయింట్ సెక్రటరీ వివి.పెద్దిరాజు, కలెక్టర్ కార్యాలయ పర్యవేక్షకులు రాంబాబు, కలెక్టర్ కార్యాలయ సిబ్బంది జగన్, సాయి, పృధ్వి, జీవన్, రవికుమార్, రిటైర్డు ఉద్యోగులు, వివిధ శాఖల ఉద్యోగుల పాల్గొన్నారు.

సమస్యలపై సిఐటియు ఎనలేని పోరాటం

ఘనంగా ఆవిర్భావ వేడుకలు



భీమవరంలో జెండా ఆవిష్కరించి నినాదాలు చేస్తున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రాజా రామ్మోహన్ రాయ్, నాయకులు

ప్రజాశక్తి - భీమవరం

కార్మికుల శ్రమ లేకుండా సంపద లేదని, కార్మికుల ప్రయోజనాలు నెరవేరకుండా అభివృద్ధి గురించి మాట్లాడలేమని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజా రామ్మోహన్‌రాయ్ అన్నారు. సిఐటియు ఆవిర్భావ దినోత్సవాన్ని స్థానిక సిఐటియు కార్యాలయం వద్ద మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజా రామ్మోహన్‌రాయ్ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. శ్రమ లేకుండా అభివృద్ధి లేదని చెబుతున్న పాలకులు శ్రమ చేసే వాళ్లకు కనీస అవసరాలు తీర్చడానికి సిద్ధంగా లేరన్నారు. కార్మికులు, ఉద్యోగుల పోరాటాల ఫలితంగా ప్రభుత్వాలు అనేక చట్టాలను రూపొందించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వం కార్మిక చట్టాలను తుంగలో తొక్కి కార్పొరేట్లకు అనుకూలమైన విధానాలను చేపడుతోందన్నారు. ఆ విధానాలను ప్రతిఘటించడంలో సిఐటియు ముందుందన్నారు. పరిస్థితులు మారాలంటే కార్మికులు ఐక్యం కావాలని, దానికోసం సిఐటియు నిరంతరం పనిచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు బి.వాసుదేవరావు, ఆంజనేయులు, శిరీష్ కుమార్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



తాడేపల్లిగూడెంలో..

చట్టాలను కాపాడుకోవడానికి, సమస్యల పరిష్కారానికి ఐక్యపోరాటాలే మార్గమని సిఐటియు పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు పిలుపునిచ్చారు. మంగళవారం సిఐటియు ఆవిర్భావం దినోత్సవం సందర్భంగా సిఐటియు జెండాను వాసుదేవరావు ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలు, ప్రజా వ్యతిరేక విధానాలపై సిఐటియు ప్రజల తరుపున పోరాటాలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కలిపిండి సత్యనారాయణ, కె.సోమేశ్వరరావు, ఎం.శివ, బి.సత్యనారాయణ పాల్గొన్నారు.

పెంటపాడు: మండలంలో పలు గ్రామాల్లో సిఐటియు ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జెండాలను ఆవిష్కరించారు. తాడేపల్లిగూడెం రైల్వే గూడ్స్‌షెడ్ వద్ద సత్తి కోదండరామిరెడ్డి, ఉల్లిపాయల మార్కెట్ వర్కర్స్ యూనియన్ వద్ద చల్లా చంద్రరావు గాంధీరెడ్డి, ప్రయివేటు గోదాముల వద్ద లంకలపల్లి అప్పారావు, సివిల్ సప్లై గోదాము వద్ద కొంపెల్ల శ్రీనివాసరావు, బి.కొండేపాడు, రైస్ మిల్లు వర్కర్స్ యూనియన్ వద్ద సిరపరపు రంగారావు, పెంటపాడు మండలంలో పని ప్రదేశాల్లో నివాస ప్రాంతాల్లో జెండా ఆవిష్కరణలు నిర్వహించారు. తాడేపల్లిగూడెం రైల్వే గుడ్ షెడ్ వద్ద యూనియన్ ప్రధాన కార్యదర్శి చిర్ల పుల్లారెడ్డి మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కించపర్చే విధంగా పరిపాలన సాగిస్తోందని తెలిపారు. సిరపరపు రంగారావు మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్‌వియస్ రెడ్డి, కర్రి సాయి రెడ్డి, కర్రి సుబ్బిరెడ్డి, అల్లు సుబ్బారావు, బంకురు నాగేశ్వరరావు, కరక వెంకట్రావు, వడ్డాది సన్యాసిరావు, బంగార్రాజు, కె.రమేష్, ఎ.శ్రీనివాసరావు, ఎన్.వరహాలు పాల్గొన్నారు.

వీరవాసరం : సిఐటియు ఉద్యోగ, కార్మిక, కష్టజీవుల పోరాటాలకు కొండంత అండగా ఉంటోందని సిఐటియు జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు అన్నారు. వీరవాసరంలో జరిగిన సిఐటియు ఆవిర్భావం సందర్భంగా జెండా ఆవిష్కరణలో ఆయన మాట్లాడారు. ఉపాధి, కనీస వేతనాలు, కార్మిక చట్టాలు అమలు, కార్మికుల ఐక్యత ప్రధాన ఏజెండాగా పనిచేస్తున్న సిఐటియు ఏర్పడిన దగ్గర్నుంచి ఈనాటి వరకూ అనేక పోరాటాలు నిర్వహించి కార్మికులకు అండగా నిలబడిందన్నారు. దేశంలో వివిధ కార్మిక సంఘాల్ని ఐక్యం చేసి ఐక్య పోరాటాలు నిర్వహించడంలో ముందుందన్నారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి పి.నాగరత్నం, రైస్ మిల్లు వర్కర్ సీనియర్ నాయకులు కె.సత్తిబాబు, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు నిర్మల, అంగన్వాడీ వర్కర్ సీనియర్ నాయకులు సత్యవతి అన్నపూర్ణ, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం నాయకులు మహాలక్ష్మి పాల్గొన్నారు.

తణుకు రూరల్ : సమస్యల పరిష్కారానికి పోరాటాలే మార్గమని సిఐటియు నాయకులు కామన మునిస్వామి అన్నారు. సిఐటియు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మున్సిపల్ కార్యాలయ సమీపంలో సిఐటియు జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మునిస్వామి మాట్లాడుతూ కార్మికుల పక్షాన పోరాటాలు, ఉద్యమాలు చేసి, వారి సమస్యలు పరిష్కరించే సంఘం సిఐటియు అన్నారు. ప్రభుత్వ రంగాలను ప్రయివేటు పరం చేసేందుకు మోడీ కషి చేస్తున్నాడని తెలిపారు. ఎన్నికల ముందు సంవత్సరానికి నాలుగు లక్షల ఉద్యోగాలిస్తామని చెప్పిన మోడీ ఉన్న ఉద్యోగాలను ఊడదీస్తూ కార్మికులను వారి కుటుంబాలను రోడ్డు మీద పడవేస్తున్నారని మునిస్వామి తెలిపారు. కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేస్తానని ఎన్నికల వాగ్దానం చేసిన జగన్మోహన్ రెడ్డి దాన్ని నిలబెట్టలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో నీలాపు ఆదినారాయణ, మందులయ్యా, నీలాపు అనంతలక్ష్మి, ఎ.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

యలమంచిలి : సిఐటియు ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం మండల వ్యాప్తంగా సంఘం ఆధ్వర్యంలో బాడవ, చించినాడ, కొంతేరు, యలమంచిలి, దొడ్డిపట్ల తదితర గ్రామాల్లో సిఐటియు జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శులు దేవ సుధాకర్, శ్రీవర్ధిని మాట్లాడారు. సిఐటియు ఆధ్వర్యంలో మరిన్ని పోరాటాలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

నరసాపురం టౌన్ : సిఐటియు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక మార్కెట్ యార్డు వద్ద సిఐటియు పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు పట్టణ అధ్యక్షులు కార్యదర్శులు ముచ్చర్ల త్రిమూర్తులు, పొన్నాడ రాము, ఇరువురు నాయకులు మాట్లాడారు. 1970 కేరళ రాష్ట్రంలో సిఐటియు ఏర్పడిందన్నారు. సిఐటియు దేశవ్యాప్తంగా కార్మిక, ఉద్యోగ, కర్షకుల సమస్యలపై అనేక ఉద్యమాలు, పోరాటాలు నిర్వహించిందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కుక్కల నాగేశ్వరరావు, మల్లుల చక్రవర్తి, పితాని రవి, ఆకన రాము, ఎం.రమేష్ పాల్గొన్నారు.

తణుకు రూరల్: కార్మికులు శ్రమ దోపిడీ విముక్తి కోసం సిఐటియు పని చేస్తోందని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ అన్నారు. మంగళవారం స్థానిక అమర వీరుల భవనం వద్ద సిఐటియు 53వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ 1970లో సిఐటియు ఏర్పడిందన్నారు. గత 52 సంవత్సరాలుగా సిఐటియు కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై రాజీలేని పోరాటాలు సాగిస్తోందన్నారు. ఇప్పటికీ కార్మికులు శ్రమను గుర్తించే ప్రభుత్వాలు రాలేదని పేర్కొన్నారు. కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేసి పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎ.అజయకుమారి, పి.దక్షిణామూర్తి, మండల కార్యదర్శి గుబ్బల గోపి, మండల ఉపాధ్యక్షులు కామన మునిస్వామి, గార రంగారావు, సిహెచ్.రంగారావు, నర్సింహారావు పాల్గొన్నారు.



తణుకురూరల్‌లో..

తాడేపల్లిగూడెం : సిఐటియు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సిఐటియ ఆవిర్భావ దినోత్సవాన్ని జెండా ఆవిష్కరణలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, సిఐటియు పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ హాజరయ్యారు. అపరాల మార్కెట్ జట్టు వర్కర్స్ యూనియన్ ఆఫీసు వద్ద కర్రి నాగేశ్వరరావు, పండ్ల మార్కెట్ జట్టు వర్కర్స్ యూనియన్ ఆఫీసు వద్ద జవ్వాది శ్రీను, కూరగాయలు మార్కెట్ జట్టు వర్కర్స్ యూనియన్ ఆఫీసు వద్ద కరెడ్ల రామకృష్ణ, చింతపండు మార్కెట్ జట్టు వర్కర్స్ యూనియన్ ఆఫీసు వద్ద మడకా రాజు, యార్డు మార్కెట్ జట్టు వర్కర్స్ యూనియన్ ఆఫీసు వద్ద మేట్రెడ్డి రమణ, ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యూనియన్ ఆఫీసు వద్ద పులిమంతుల రమణ, ఎరువులు మార్కెట్ జట్టు వర్కర్స్ యూనియన్ ఆఫీసు వద్ద కుంచంగి నానాజీ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆఫీసు వద్ద ధనాల వెంకట్రావు, 3ఎఫ్ వర్కర్స్ యూనియన్ ఆఫీసు వద్ద తాటిపర్తి గణ్ణేశ్వరరావు జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం లౌకిక విధానాన్ని, ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని, కించపరిచే విధంగా పరిపాలన సాగిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కార్మికులు పాల్గొన్నారు.

మొగల్తూరు : కార్మికుల సమస్యలపై పోరాడే సంఘం సిఐటియు అని సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తెలగంశెట్టి సత్యనారాయణ అన్నారు. మొగల్తూరులోని సిఐటియు ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం సిపిఎం కార్యాలయం వద్ద సిఐటియు పతకాన్ని ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో ప్రదర్శన చేశారు. కార్యక్రమాల్లో ఆశా వర్కర్ల జిల్లా సహాయ కార్యదర్శి ఎండి షరీఫ్ బేగం, జిల్లా అధ్యక్షురాలు సిహెచ్.లక్ష్మి, మొగల్తూరు మండల నాయకులు బేబీ కుమారి, ప్రసన్న పాల్గొన్నారు.



వీరవాసరంలో..

ఆర్ఎస్‌కు ఎడిటర్ తులసీదాస్ పరామర్శ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

సిపిఎం మాజీ రాష్ట్ర కమిటీ సభ్యులు, మాజీ ఎంఎల్ఎ ఆర్.సత్యనారాయణరాజు(ఆర్ఎస్) వయసు పైబడటంతో ఇంటికే పరిమితమయ్యారు. మంగళవారం భీమవరం వచ్చిన ప్రజాశక్తి ఎడిటర్ తులసీదాస్ ఆర్ఎస్ నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆర్ఎస్ దగ్గర కూర్చుని ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తులసీదాస్ మాట్లాడుతూ ఆర్.సత్యనారాయణరాజు ఎంఎల్ఎగా పనిచేసిన రోజుల్లో సైతం ప్రజా సమస్యలపై పోరాడి పేదలకు అండగా నిలిచారన్నారు. అలాగే సిపిఎంలో ప్రజా పోరాటంలో కీలక పాత్ర పోషించే వారన్నారు. వయసు పైబడినప్పటికీ ఆయనలో నాటి పోరాట పటిమ కనిపిస్తోందన్నారు. తులసీదాస్ వెంట ప్రజాశక్తి జిల్లా సమన్వయ కమిటీ కన్వీనర్ వేంద్ర ప్రసాద్, జిల్లా యాడ్స్ ఇన్‌ఛార్జి పి.నారాయణరాజు ఉన్నారు.



ఆర్ఎస్‌తో మాట్లాడుతున్న ప్రజాశక్తి ఎడిటర్ తులసీదాస్

పూడికతీత పనులు పరిశీలన

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

మంగళవారం పట్టణంలో 7, 11 వార్డుల్లో పారిశుధ్య సిబ్బంది నిర్వహిస్తున్న డ్రెయినేజీ పూడికతీత పనులను రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి.ప్రసాదరాజు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శానిటేషన్‌పై స్పెషల్ డ్రైవ్ చేపట్టి ఎప్పటికప్పుడు పేరుకున్న చెత్త తొలగించడంతో పాటు డ్రెయినేజీలో పూడిక తొలగించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. వర్షాకాలం వస్తున్న నేపథ్యంలో వార్డుల్లో డ్రెయిన్లు పొంగి మురుగు నీరు రోడ్లపై ప్రవహించకుండా ముందస్తు చర్యల్లో భాగంగా వార్డుల్లో డ్రెయిన్ పూడికతీత పనులు చేపట్టినట్లు తెలిపారు. రోడ్లపైకి ఎక్కడా మురుగునీరు చేరకుండా పక్కా ప్రణాళిక ప్రకారం వార్డులు, గ్రామాల్లో పూడికతీత పనులు చేపడుతున్నామన్నారు. మురుగునీరు నిల్వ ఉండే ప్రాంతాలను గుర్తించి, మురుగు నిలువ లేకుండా చర్యలు చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్ పర్సన్ బర్రె శ్రీవెంకటరమణ జయరాజు, మున్సిపల్ కమిషనర్ కె.వెంకటరావు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పెనుమంట్రలో వర్షం

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలో మంగళవారం కొద్దిపాటి వర్షం కురిసింది. మార్టేరు, ఆలమూరు, భట్లమగుటూరు, ఓడూరు, నెలమూరు, వెలగలేరు, పొలమూరు, మాముడూరు, సోమరాజు ఇల్లింద్రపర్రు, గరువు, మల్లిపూడి, జుత్తిగ గ్రామాల్లో స్వల్పంగా వర్షం కురిసింది. నిన్న, మొన్నటి వరకూ వేసవి తాపానికి గురైన సామాన్య ప్రజలకు కొద్దిపాటి వర్షం కారణంగా సేద తీర్చుకున్నారు.

పాలకొల్లు : నియోజకవర్గంలో మంగళవారం మధ్యాహ్నం భారీ వర్షం పడింది. దీంతో వాతావరణం చల్లబడింది. నాలుగు రోజులుగా రోహిణీ కార్తె ప్రభావంతో ఎండ వేడిమి ఎక్కువగా ఉంది. అయితే వర్షం పడడంతో వాతావరణం చల్లబడింది. పేద, మధ్య తరగతి ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్నారు. అయితే ఆకస్మిక వర్షంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.


కేక్ కట్ చేస్తున్న మంత్రి కొట్టు సత్యనారాయణ

నవశకానికి సిఎం జగన్ నాంది

మంత్రి కొట్టు సత్యనారాయణ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాలన నవ శకానికి నాంది పలికిందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దేవదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. సరిగ్గా నాలుగు ఏళ్ల క్రితం మే 30వ తేదీ రాష్ట్ర రాజకీయ చరిత్రను మలుపు తిప్పిన రోజు అని ఆయన పేర్కొన్నారు. ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేసి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా తాడేపల్లిగూడెం నియోజకవర్గం వైసిపి కార్యాలయంలో మంగళవారం సిఎం జగన్ నాలుగేళ్ల వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి జెండా రంగులతో కూడిన భారీ కేకును మంత్రి కొట్టు సత్యనారాయణ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నాలుగేళ్లలో 1,60,000 కుటుంబాలకు రెండు లక్షల పదివేల కోట్ల రూపాయలు ఆర్థిక లబ్ధిని సంక్షేమ పథకాల ద్వారా చేకూర్చడం జరిగిందన్నారు. నాడు-నేడు కింద బడులు, ఆసుపత్రులను ఆధునీకరించి విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మకమైన మార్పులతో పాటు ముఖ్యమంత్రి జగన్ వాలంటీర్లు, సచివాలయం వ్యవస్థతో గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం తీసుకొచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ కె.శ్రీనివాసరావు, వైసిపి జిల్లా అధికార ప్రతినిధి కొలుకులూరి ధర్మరాజు, వైస్ ఎంపిపి సూర్పని రామకృష్ణ పాల్గొన్నారు.

2 నుంచి విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ

ప్రజాశక్తి - భీమవరంరూరల్

ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో జూన్ 2 నుండి 4వ తేదీ వరకూ ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఉచితంగా కంప్యూటర్ శిక్షణ నిర్వహిస్తున్నట్లు కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ కెవి.మురళీకృష్ణ చెప్పారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ హెడ్ డాక్టర్ వి.చంద్రశేఖర్ మాట్లాడుతూ ఇంటర్ పాసైన విద్యార్థులకు సి ప్రోగ్రామింగ్, కంప్యూటర్ ఫండమెంట్స్‌పై ఉచితంగా కేవలం 100 మందికి మాత్రమే శిక్షణ అందించనున్నట్లు ఆయన వెల్లడించారు. శిక్షణలో పాల్గొనే విద్యార్థులు ఆయా కళాశాలలో ఇప్పటికే గూగుల్ సీట్స్ అందించడం జరిగిందని వాటి ద్వారా నమోదు చేయించుకోవాలని ఆయన సూచించారు. తరగతులు ఉదయం తొమ్మిది నుండి 12 గంటల వరకు మాత్రమే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన కె.రఘు సీతారామరాజు, సిహెచ్ రాము నాయుడు, డివిఎస్ఆర్‌కె.రాజు, సిహెచ్ రఘురాం కార్యక్రమాలకు కోఆర్డినేటర్‌గా వ్యవహరిస్తారని పేర్కొన్నారు.

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

టిడిపి ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రకాశంచౌక్ సెంటర్లో టిడిపి నాయకులు చంద్రబాబునాయుడు చిత్రపటానికి మంగళవారం పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పార్టీ జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి మాట్లాడారు. చంద్రబాబు మహానాడులో ప్రకటించిన సంక్షేమ పథకాల నేపథ్యంలో చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. చంద్రబాబు పథకాలతో అధికార పార్టీలో గుబులు పుట్టిందన్నారు. రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి మాట్లాడుతూ మహానాడు వేదికగా చంద్రబాబు మహిళలకు దీపం పథకం ద్వారా ప్రతి కుటుంబానికీ ఏటా మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర కార్యదర్శి వెంద్ర శ్రీనివాస్ మాట్లాడుతూ వెనుకబడిన కులాల రక్షణకు ప్రత్యేక చట్టాన్ని ఇవ్వడం హర్షణీయమని తెలిపారు. రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ డ్వాక్రా సంఘాల ప్రధాన కార్యదర్శి మేరగాని నారాయణమ్మ, జిల్లా ఉపాధ్యక్షుడు మామిడిశెట్టి ప్రసాద్, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఇందుకూరి సుబ్రహ్మణ్యరాజు, గూడూరి సుబ్బారావు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - ఆకివీడు

ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.శ్రీకర్, ఆకివీడు తాలూకా యూనిట్ కార్యదర్శి ఎంకె.ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర స్థాయిలో చేపట్టిన నిరసనలో భాగంగా స్థానిక తహశీల్దార్ కార్యాలయం ప్రాంగణంలో మంగళవారం ఒకరోజు ఉద్యోగులు దీక్ష చేపట్టారు. పిఆర్‌సిని జులై 2023 నుంచి అమలు చేయాలని, గత పిఆర్‌సి ఏరియర్స్ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఎం.విజయకుమార్, జిల్లా అధ్యక్షులు జిఆర్ఎస్ఎన్.రాజు, కార్యదర్శి పిఎస్.చంద్రమౌళి, జిల్లా నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి, ప్రభుత్వ చీఫ్ విప్ ప్రసాదరాజు

సిఎస్ఆర్ నిధులు కేటాయించాలి

ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

ఒఎన్‌జిసి సిఎస్ఆర్ నిధులు అందజేయడం ద్వారా నరసాపురం నియోజవర్గానికి తోడ్పడాలని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు ఒఎన్‌జిసి అధికారులను కోరారు. మంగళవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టరు ఛాంబర్‌లో జిల్లా కలెక్టరు పి.ప్రశాంతితో కలిసి రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు ఒన్‌జిసి అధికారులతో సమావేశమయ్యారు. సిఎస్ఆర్ నిధులు నియోజక వర్గానికి కేటాయింపుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రసాదరాజు మాట్లాడుతూ విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలు కల్పన, పర్యావరణ పరిరక్షణ తదితర నియోజకవర్గంలో అవసరాల ప్రతిపాదనల మేరకు సిఎస్ఆర్ నిధులను సమకూర్చాలని కోరారు. పేరుపాలెం బీచ్‌ను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసి రహదారులు, విద్యుత్ దీపాలు వంటి తదితర మౌలిక సదుపాయాలు కల్పించి బీచ్ సందర్శకులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలని ప్రభుత్వం ఆలోచన అని దీనికి అనుగుణంగా ఓఎన్జిసి సిఎస్ఆర్ నిధులు కేటాయించాలని ప్రసాదరాజు అధికారులను కోరారు. జిల్లా కలెక్టరు ప్రశాంతి మాట్లాడుతూ స్థానిక ప్రజా ప్రతినిధుల సమన్వయంతో ప్రజల అవసరాలకు అనుగుణంగా ఒఎన్‌జిసి అధికారులు సిఎస్ఆర్ నిధులను మంజూరు చేసి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఒఎన్‌జిసి కార్యకలాపాలు ఎక్కువగా నరసాపురం నియోజకవర్గంలో జరుగుతున్నాయన్నారు. జిల్లాకు ఏకైక తీర ప్రాంతం నరసాపురం నియోజక వర్గం కావున మొదట ప్రాధాన్యతివ్వాలన్నారు. జిల్లా యంత్రాంగం ప్రతిపాదనను కూడా దృష్టిలో ఉంచుకుని తగు సిఫార్సులు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ, ఒఎన్‌జిసి సర్ఫస్ మేనేజర్ డిఎ సబ్బరాజు, ఏరియా మేనేజర్ డి.రాజ్‌కుమార్, హెచ్ఆర్ మేనేజరు డి.శ్రీనివాస్ పాల్గొన్నారు.


పాలకొల్లు మున్సిపల్ కార్యాలయం


పేరుకుపోయిన చెత్త

మాస్టర్‌ప్లాన్ అమలెప్పుడో..?

పాలకొల్లు మాస్టర్ ప్లాన్‌కు తీరిన గడువు - అభివృద్ధి లేక సమస్యలతో ప్రజలు సతమతం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు పట్టణానికి మాస్టర్‌ప్లాన్ లేక అభివృద్ధి అంతంత మాత్రంగానే ఉంది. పట్టణాలకు 20 సంవత్సరాలకోసారి మాస్టర్ ప్లాన్ తయారు చేస్తారు. పాలకొల్లు పట్టణానికి 2000 - 2020 వరకూ మాస్టర్ ప్లాన్ అమలు చేశారు. అయితే 2019లోనే మాస్టర్ ప్లాన్‌పై చర్చ జరగాల్సి ఉంది. అయితే అసెంబ్లీ ఎన్నికలు అయినా పాలకొల్లు మున్సిపాల్టీకి 4 సంవత్సరాలుగా ఎన్నికలు జరగక పట్టణ అభివృద్ధిపై ఎవరికీ సరైన ప్రణాళిక లేక మాస్టర్ ప్లాన్‌పై చర్చ జరగలేదు. పైగా 4 సంవత్సరాలుగా వైసిపి ఇన్‌ఛార్జి నియోజకవర్గానికి చెందని వ్యక్తి కావడంతో పట్టణ అభివృద్ధిపై అంతగా ఆసక్తి లేకపోయింది. ప్రత్యేక అధికారులకు ఇతర బాధ్యతలు ఉండడంతో పట్టణ అభివృద్ధికి సమయం కేటాయించ లేకపోవడం కూడా కారణం.

ఇంకా కోర్టులోనే..

పట్టణంలో 7 గ్రామాలు విలీనం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే దీనిపై కొంతేరు, అడవిపాలేనికి సంబంధించి ఇంకా కోర్టులో సమస్య పెండింగ్‌లో ఉంది. దీంతో గత నెల ప్రభుత్వం పాలకొల్లురూరల్ పంచాయతీకి చెందిన పూలపల్లి, ఉల్లంపర్రు, వరిధనం, భగ్గేశ్వరం గ్రామాలను పాలకొల్లులో విలీనం చేశారు. అయితే తమకు ఇంకా మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ నుంచి ఉత్తర్వులు రాలేదని మున్సిపల్ కమిషనర్ శేషాద్రి చెబుతున్నారు. దీంతో ఇంకా పాలకొల్లు పట్టణంపై స్పష్టమైన ముఖచిత్రం రాలేదు. దిగమర్రు గ్రామాన్ని కలిపితేనే పాలకొల్లు జనాభా లక్ష దాటి కేంద్ర ప్రభుత్వ అమృత్ పట్టణాల నిధులు వచ్చేవి. అయితే వైసిపి ఇన్‌ఛార్జి కవురు శ్రీనివాస్ దిగమర్రును విలీనం చేయడానికి ఆసక్తి చూపక ఈ అవకాశం పోయింది.

ఇంకా ప్రారంభం కాని మాస్టర్ ప్లాన్ పనులు..

భీమవరం ఇటీవల మాస్టర్‌ప్లాన్ అమలుకు నిర్ణయం తీసుకుంది. పాలకొల్లు ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు టిడిపికి చెందిన వ్యక్తి కావడం అధికార వైసిపి నేతలు రాజకీయ విభేదాలతో ఉండడం పాలకొల్లుకు మాస్టర్ ప్లాన్ పై ఆసక్తి ఎవరికి లేకుండా పోయింది.

ఉన్నతాధికారులు, మంత్రులకు పట్టని పాలకొల్లు అభివృద్ధి..

టిడిపి హయాంలో పాలకొల్లు పట్టణ అభివృద్ధికి నిమ్మల రామానాయుడు రూ.300 కోట్లకు పైగా నిధులు తెచ్చి పట్టణాన్ని అభివృద్ధి చేశారు. గత ఎన్నికల్లో 19 వేలకు పైగా మెజార్టీతో వైసిపి ఘన విజయం సాధించింది. దీంతో గత నాలుగేళ్లల్లో పాలకొల్లు పట్టణాభివృద్ధి కుంటుపడింది. దీంతో నిమ్మల సమర్ధ నేతగా వైసిపి నేతలే చెపుతున్నారు.

పాలకొల్లుపై ఎంపీ మిథున్ రెడ్డి గురి..

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పాలకొల్లు సీటు ఎలాగైనా సాధించాలని వైసిపి అధిష్టానం ఎంపీ మిథున్‌రెడ్డిని రంగంలో దింపింది. అయితే పాలకొల్లు పట్టణాభివృద్ధి గురించి మాత్రం పట్టించుకొనే నేతలు లేకపోవడంతో పాలకొల్లుకు గడువు తీరిన మాస్టర్ ప్లాన్ అమలు కావడంలేదు. దీంతో పట్టణంలో ట్రాఫిక్, పారిశుధ్యం, డ్రెయినేజీ, రోడ్లు, బైపాస్ రోడ్డు నిర్మాణం, డంపింగ్ యార్డు, తాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయలేక ప్రజల అవస్థలు పడుతున్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

ఎంపిపి శిరీషా విశ్వనాథరాజు

ప్రజాశక్తి - కాళ్ల

కాలువలకు నీరు విడుదల చేయగానే తాగునీటి చెరువులు పూర్తిస్థాయిలో నింపుకుని ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించే విధంగా కృషి చేయాలని ఎంపిపి పెన్మెత్స శిరీష విశ్వనాథరాజు అధికారులకు సూచించారు. కాళ్ల మండల పరిషత్తు సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపిపి పెన్మెత్స శిరీష విశ్వనాథరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలను నిర్వీరామంగా అమలు చేస్తోందన్నారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపర్చడానికి కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో వివిధ ప్రభుత్వ శాఖాధికారులు మాట్లాడుతూ తన శాఖల ద్వారా అమలవుతున్న పథకాల తీరును గ్రామాలవారీగా వివరించారు. సమావేశంలో జెడ్‌పిటిసి పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, ఎంపిడిఒ జి.స్వాతి, తహశీల్దార్ టిఎ.కృష్ణారావు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు


బీచ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న జెసి

పేరుపాలెం బీచ్‌లో జెసి పరిశీలన

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెం బీచ్‌ను మంగళవారం జాయింట్ కలెక్టర్ రామ్ సుందర్ రెడ్డి సందర్శించారు. బ్లూ ఫ్లాగ్, రిసార్ట్స్ తదితర నిర్మాణాలు చేపట్టనున్న భూములను ఆయన పరిశీలించారు. వాటి రికార్డులను, మ్యాపులను పరిశీలించి తహశీల్దార్ జి.అనిత కుమారిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సర్వేయర్ ధనరాజ్ సిబ్బంది ఉన్నారు.

నాలుగేళ్ల పాలనలో అభివృద్ధి శూన్యం

వినియోగదారుల సంఘం కార్యదర్శి గోపాలకృష్ణార్జునరాజు

ప్రజాశక్తి - ఉండి

వైసిపి నాలుగేళ్ల పాలనలో చేసిన అభివృద్ధి శూన్యమని యండగండి వినియోగదారుల సంఘం కార్యదర్శి పివిఎస్ గోపాలకృష్ణార్జునరాజు అన్నారు. మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వైసిపి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నాలుగేళ్ల కాలంలో ఇంతవరకూ చేసిన అభివృద్ధి ఏమీ లేదని, వైసిపి నాయకులు నాలుగు సంవత్సరాల పాలనలో ఏదో సాధించినట్లు విజయోత్సవ ర్యాలీలు చేసుకోవడం విడ్డూరమన్నారు. వైసిపి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి నేటి వరకూ అభివృద్ధిని గాలికొదిలేసి సుమారు రూ.పది లక్షల కోట్ల అప్పులు చేసి సంక్షేమం పేరుతో అనర్హులకు పంచిపెట్టడమే కాకుండా ఓట్ల కోసం కుస్తీలు పడుతున్నారని విమర్శించారు. రాష్ట్రానికి పరిశ్రమలు తీసుకు రాకపోవడం వల్ల విద్యార్థులకు, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు దెబ్బతిని వారి పరిస్థితి అగమ్యగోచరంగా తయారైందన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి నియంతృత్వ పోకడలను విడనాడి అభివృద్ధిపై దృష్టి సారించాలని పివిఎస్ గోపాలకృష్ణంరాజు కోరారు.

'దాసరి' మహిళా పక్షపాతి

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు డిఎన్ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల వ్యవస్థాపకుడు, దర్శకరత్న దాసరి నారాయణరావు వర్థంతి సందర్భంగా మంగళవారం కళాశాల ప్రిన్సిపల్ శోభారాణి, వైస్.ప్రిన్సిపల్ రవిశంకర్, దాసరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపల్ శోభారాణి మాట్లాడుతూ దాసరి నారాయణరావు మహిళా పక్షపాతి అన్నారు. అనేక మహిళా సమస్యలపై సినిమాలు నిర్మించి పోరాటం చేశారన్నారు. మహిళలపై ఆయనకున్న గౌరవానికి, అభిమానానికి ఈ కళాశాలే నిదర్శనమని పేర్కొన్నారు. కళాశాల త్వరలోనే 'నాక్' గుర్తింపునకు వెళ్లబోతుందని, కళాశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు గాను దాసరి కుటుంబ సభ్యులు, మిత్రులు, అభిమానులు,పుర ప్రముఖులు తమ సహాయ సహకారాలు అందచేయాలని విజ్ఞప్తి చేశారు.

జగనన్న కాలనీలకు ఉచితంగా బొండు మట్టి

ప్రజాశక్తి - ఆచంట

ఆచంట నియోజకవర్గంలో జగనన్న కాలనీలో ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులకు ఉచితంగా బొండు మట్టిని అందించనునట్లు ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు తెలిపారు. నియోజకవర్గంలో ఆచంట, పోడూరు, పెనుమంట్ర, మండలాలకు సంబంధించి, కోడేరు గోదావరిలో ఇసుక ర్యాంపు నుంచి బొండు మట్టిని ఉచితంగా తీసుకెళ్లి తమ పునాదుల్లో నింపుకోవాలని ఆయన తెలిపారు. పెనుగొండ మండలానికి సంబంధించి, సిద్ధాంతం ఇసుక ర్యాంపు నుంచి బొండు మట్టిని తరలించుకోవచ్చని తెలిపారు. మండల సర్పంచులు, ఎంపిటిసిలు, వైసిపి కార్యకర్తలు ఈ విషయాన్ని లబ్ధిదారులకు తెలియజేయాలని ఆయన సూచించారు.

ఆచంట నుంచే పోటీ చేస్తా : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - ఆచంట



కేక్‌కట్ చేస్తున్న ఎంఎల్ఎ శ్రీరంగనాథరాజు

రానున్న ఎన్నికల్లో ఆచంట నియోజకవర్గం నుంచి తాను పోటీ చేస్తానని నియోజకవర్గ ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి జగనన్న సంతకానికి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం పోడూరు మండలం తూర్పుపాలెం క్యాంపు కార్యాలయం వద్ద కార్యకర్తలతో సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా భారీ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆచంట నియోజకవర్గం నుంచి రానున్న ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధిస్తానని దీమా వ్యక్తం చేశారు. నియోజవర్గంలో అభివృద్ధి జరగలేదని ప్రతిపక్షాలు మాట్లాడుతున్న మాటల్లో వాస్తవం లేదన్నారు. ఎక్కడా ఎటువంటి అవినీతికి తావులేకుండా పారదర్శకంగా నడుస్తున్న ప్రభుత్వం వైసిపి అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ స్థాయి ఎఎంసి ఛైర్మన్లు, జెడ్‌పిటిసి, ఎంపిటిసిలు, సర్పంచులు పాల్గొన్నారు.

రాబోయే రోజుల్లో వాలంటీర్ల జీతాల పెంపు

డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు

ప్రజాశక్తి - పాలకోడేరు


వాలంటీర్లను సత్కరిస్తున్న డిసిసిబి ఛైర్మన్ పివిఎల్, సీతయ్య, వెంకటరాజు

ప్రభుత్వం వేసే ప్రతి అడుగులో వాలంటీర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని, రాబోయే రోజుల్లో వాలంటీర్ల జీతాలు పెంచే విధంగా ప్రభుత్వం ఆలోచన చేస్తోందని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు అన్నారు. మోగల్లు పాత పంచాయతీ భవనంలో గ్రామ వాలంటీర్ల సత్కార కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పివిఎల్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మానస పుత్రిక వాలంటీర్ల వ్యవస్థ అని చెప్పారు. పార్టీలో ఎవరికీ లేని గౌరవం వాలంటీర్ల వ్యవస్థకు ఉందని పేర్కొన్నారు. కేవలం జీతమే ప్రామాణికంగా కాకుండా సేవ చేయాలనే ముఖ్యోద్దేశంతో వాలంటీర్లు పనిచేయడం అభినందనీయమన్నారు. గతంలో టిడిపి అధినేత చంద్రబాబు వాలంటరీ వ్యవస్థపై దుర్మార్గ ప్రచారం చేశారని గుర్తు చేశారు. రాబోయే రోజుల్లో జీతాలు పెంచే విధంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి యూత్ విభాగం మండల అధ్యక్షులు పెనుమత్స వెంకటరాజు, ఉపసర్పంచి పెనుమత్స సీతారామరాజు (సీతయ్య), సర్పంచులు ఛాంబర్ మండల అధ్యక్షులు భూపతిరాజు వంశీకృష్ణమరాజు, ఉప ఎంపిపి నరేష్, ఎంపిటిసిలు కాటూరి శాంతకుమారి, వెంకటలక్ష్మి, నాయకులు పిన్నమరాజు నాగరాజు, నాగారం, కొత్తపల్లి కాశీ విశ్వనాథరాజు, కటిక శ్రీదేవి, పాల రాధాకృష్ణ, హనుమంతరావు, షేక్ పాపసాహెబ్, పంచాయతీ కార్యదర్శి కె.వెంకటరాజు, వాలంటీర్లు పాల్గొన్నారు.

వాలంటీర్ల సేవలు వెలకట్టలేనివి : పివిఎల్

ప్రజాశక్తి - ఉండి

వాలంటీర్ల సేవలు వెలకట్టలేనివని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు అన్నారు. మంగళవారం యండగండి గ్రామంలో ఎంపిడిఒ అడబాల వెంకట అప్పారావు అధ్యక్షతన నిర్వహించిన వాలంటీర్లకు వందనం కార్యక్రమంలో పివిఎల్ నరసింహరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన వాలంటరీ వ్యవస్థ ఎంతో మహోన్నతమైందన్నారు. కరోనా సమయంలో వాలంటీర్లు చేసిన సేవలు వెలకట్టలేనివన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాలూ వాలంటీర్ల వ్యవస్థను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రభుత్వం వాలంటీర్లకు ఇచ్చే గౌరవ వేతనం కన్నా ఎక్కువగా వారు కష్టపడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు, గులిపల్లి అచ్చారావు, ఎండగండి సర్పంచి గోగులమండ చిన్న కృష్ణమూర్తి, ఉనుదుర్రు సర్పంచి పిన్నమరాజు నాగలక్ష్మి పాల్గొన్నారు.

అంబేద్కర్ కాంస్య విగ్రహావిష్కరణను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - కాళ్ల

కుల, మత, వర్గ విభేదాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ అంబేద్కర్ కాంస్య విగ్రహావిష్కరణ కార్యరకమాన్ని జయప్రదం చేయాలని రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ బహుజన సమైక్య సంఘం వ్యవస్థాపకులు సోడదాసి గంగయ్య అన్నారు. కాళ్లకూరులో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ బహుజన సమైక్య సంఘం కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ భీమవరంలో వచ్చే నెల ఆరో తేదీన అంబేద్కర్ కాంస్య విగ్రహావిష్కరణ జరుగుతుందన్నారు. ముఖ్యఅతిథులుగా శాసన మండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, ఎంఎల్ఎ గ్రంథి శ్రీనివాస్ పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. వివిధ గ్రామాల నుంచి ప్రజలు ర్యాలీగా ఒక్కటై ముందుకెళ్లాలని నిర్ణయించామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మైలా శ్రీనివాస్, బుంగా ఆదాము, రంజిత్, సందీప్, కన్నయ్య, రాజేష్, అశోక్ కుమార్ పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై కేసు

ప్రజాశక్తి - ఉండి

యువతి అదృశ్యంపై కేసు నమోదైన సంఘటన వాండ్రం గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. వాండ్రం గ్రామానికి చెందిన దారపు రాజరాజేశ్వరి పెద్ద కుమార్తె సాయి లహరి సోమవారం మధ్యాహ్నం గుడికి అని బయటకెళ్లింది. ఎంతకీ రాకపోయేసరికి కుటుంబసభ్యులు వెతికారు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో ఉండి పోలీసులకు మంగళవారం సాయంత్రం ఫిర్యాదు చేశారు. ఎస్ఐ గంగాధరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

'జనసేన బలోపేతానికి కృషి చేయాలి'

నరసాపురం టౌన్: జనసేన బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొమ్మిడి నాయకర్ తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో పట్టణ కార్యకర్తల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకర్ మాట్లాడుతూ పట్టణ స్థాయిలో జనసేనన్ను మరింత బలోపేతం చేసి రాబోయే ఎన్నికల్లో అధికారం దిశగా అందరూ ముందుకెళ్లాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో చినమిల్లి సత్యనారాయణ, జక్కం బాబ్జి, మాదంశెట్టి కోటేశ్వరరావు, ఆకన చంద్రశేఖర్, కొల్లాటి గోపీకృష్ణ, బందెల రవీంద్ర, ఆకుల వెంకటస్వామి, గుబ్బల మార్రజు, తోట నాని పాల్గొన్నారు.